

# ఫార్ములా-ఈ రేసు రద్దు!

## సర్కారు తీరుతో నిర్వహణ అసాధ్యమంటూ ప్రకటన..

**నిర్వహణపై కాంగ్రెస్ ప్రభుత్వంతో సంప్రదింపులు**

**హైదరాబాద్‌కు అంతర్జాతీయ గుర్తింపు తెచ్చిన కేటీఆర్ • నగర ఆర్థిక వ్యవస్థకు 650 కోట్ల ప్రయోజనం**

సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): ఎఫ్ఐఏ ఫార్ములా-ఈ రేసింగ్... అంతర్జాతీయంగా హైదరాబాద్ నగరానికి గుర్తింపు తెచ్చిన ఈ ఈవెంట్ ఇప్పుడు నగరానికి దూరం కానుందా? కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అప్పటి ఐటీ మంత్రి కేటీఆర్ అహర్నిశలు శ్రమించి, ఒప్పించి రేసింగ్‌కు హైదరాబాద్‌ను వేదికగా మలిచిన శ్రమంతా వృథా అవుతుందా? ఫార్ములా-ఈ రేస్ ప్రతినిధులు గురువారం విడుదల చేసిన పత్రికా ప్రకటన చూస్తే ఇవి నిజమేనని స్పష్టమవుతుంది. 150 ప్రపంచ దేశాలు ప్రత్యక్షంగా వీక్షించిన ఈ-రేస్‌ను కేసీఆర్ ప్రభుత్వం విజయవంతంగా నిర్వహించగా... ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి ఆ స్థాయి అంకిత భావం కనిపించకపోవడంతోనే క్యాలెండర్ నుంచి హైదరాబాద్ ఈ-ప్రిక్స్‌ను తొలిగించేందుకు వేగంగా అడుగులు పడుతున్నట్లు తెలుస్తున్నది. కాంగ్రెస్ ప్రభుత్వంతో సంప్రదింపుల అనంతరం 'వచ్చే ఏడాది ఈ-ప్రిక్స్ నిర్వహణ సాధ్యమయ్యేలా కనిపించడం లేదు' అని ప్రతినిధులు అధికారికంగా ప్రకటించారు. దీంతో టోక్యో, షాంఘై, బెర్లిన్, లండన్‌తో పాటు ఈ- రేస్ ప్రపంచ చాంపియన్‌షిప్‌నకు ఆతిథ్యాన్ని ఇచ్చే అద్భుతమైన అవకాశాన్ని హైదరాబాద్ నగరం చేజార్చుకున్నట్లయింది. ఈ నేపథ్యంలో వందల కోట్లల్లో రావాల్సిన ఆదాయాన్ని కూడా హైదరాబాద్ ఆర్థిక వ్యవస్థ కోల్పోయిందనేది కూడా సుస్పష్టం.

**కేటీఆర్ చొరవతో ఫార్ములా-ఈ:**

ఒలింపిక్స్... క్రికెట్ పోటీలు... ఇలా అంతర్జాతీయ క్రీడలకు ఆతిథ్యాన్ని ఇచ్చేందుకు ప్రపంచవ్యాప్తంగా నగరాలు పోటీ పడతాయి. నిర్వాహకులను ఒప్పించి... వారిని మెప్పించి... తమ నగరాలను వేదికగా మలిచేందుకు అనేక దేశాల్లోని నగరాలు నెలలు, సంవత్సరాలు శ్రమిస్తాయి. ఇలా నిర్వాహకులు సంతృప్తి చెందితేనే ఆయా పోటీలకు ఆతిథ్యం కల్పించేందుకు నగరాలకు అనుమతినిస్తాయి. ఈ నేపథ్యంలో కేసీఆర్ ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరిలో ఫార్ములా-ఈ రేస్‌ను విజయవంతంగా నిర్వహించింది. రెండు రోజుల పాటు జరిగిన ఈ పోటీల కోసం పకడ్బందీగా ఆతిథ్యాన్ని కల్పించింది. హుస్సేన్‌సాగర్ తీరంలో జరిగిన ఈ పోటీలను ప్రపంచవ్యాప్తంగా 150 దేశాలు ప్రత్యక్షంగా వీక్షించాయి. సచిన్ టెండూల్కర్ సహా అంతర్జాతీయ క్రీడా, పారిశ్రామిక, సినీ అనేక రంగ ప్రముఖులు నగరానికి క్యూ కట్టారు. 31వేల మంది ప్రతినిధులు పోటీలను చూసేందుకు రాగా... అందులో 51 శాతం మంది ఇతర నగరాలు, దేశాల నుంచి వచ్చిన వారే ఉండటం విశేషం. కేసీఆర్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని ఈ పోటీలను విజయవంతం చేయడంతో అంతర్జాతీయంగా హైదరాబాద్ పేరు మారుమోగింది. దేశంలోని మరే ఇతర మెట్రో నగరాలకు దక్కని అవకాశాన్ని కేసీఆర్ ప్రభుత్వం సద్వినియోగం చేసుకుంది. దీంతో ఫార్ములా-ఈ రేస్ నిర్వహణ ద్వారా హైదరాబాద్ ఆర్థిక వ్యవస్థకు సుమారు 700 కోట్లు (83.7 మిలియన్ డాలర్లు) మేర ప్రయోజనం చేకూరినట్లు నీల్సన్ స్పోర్ట్స్ అనాలసిస్ తన ఆర్థిక అధ్యయన నివేదికలో వెల్లడించింది.

**నిర్వహణకు గతంలోనే ఒప్పందం...**

వాస్తవానికి నాలుగు సంవత్సరాలు హైదరాబాద్‌లో పోటీలను నిర్వహించేందుకు అప్పట్లోనే తెలంగాణ ప్రభుత్వంతో పార్ములా-ఈ ఒప్పందం కుదుర్చుకుంది. గ్రీన్‌కో నిర్వహణ బాధ్యతలు చేపట్టింది. ఈ ఏడాది ప్రారంభంలో ఫార్ములా-ఈ రేస్ విజయవంతం అయిన తర్వాత వచ్చే ఏడాది ఫిబ్రవరి పదో తేదీన మరోసారి నిర్వహణకు నిర్ణయించారు. ఈ మేరకు క్యాలెండర్‌లో హైదరాబాద్ ఈ-ప్రిక్స్‌ను చేర్చారు. ఈ నేపథ్యంలో రేసు నిర్వహణ సాధ్యం కాదంటూ గురువారం ప్రతినిధులు ప్రకటన విడుదల సంచలనం రేపింది. 'వచ్చే ఫిబ్రవరి 10న హైదరాబాద్‌లో ఈ-రేస్ నిర్వహించేందుకుగాను ఈ ఏడాది అక్టోబరు 30న కేసీఆర్ ప్రభుత్వంతో ఒప్పందం జరిగింది. ఈ నేపథ్యంలో తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిర్వహణకు సంబంధించి ప్రక్రియల్ని ముందుకు తీసుకుపోయేందుకు మా సీనియర్ ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించారు. పలు దఫాలుగా సంప్రదించిన తర్వాత ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నుంచి మాకు ఒక లేఖ వచ్చింది. నిర్వహణపై గత ప్రభుత్వంతో జరిగిన ఒప్పంద వివరాలు ఏమిటి? నిర్వహణ వల్ల హైదరాబాద్‌కు కలిగే ప్రయోజనం ఏంది? అని ఆ లేఖలో ప్రభుత్వం మమ్మల్ని వివరాలు కోరింది. ఆ లేఖను పరిశీలిస్తే... హైదరాబాద్ ఈ-ప్రిక్స్ నిర్వహణపై ప్రణాళిక ప్రకారంగా ముందుకుపోవడం సాధ్యం కాదని అర్థమవుతుంది. నిర్వహణకు మరికొన్ని వారాల సమయమే ఉండటం, ఇప్పటికే భాగస్వాములు, సరఫరాదారులు భారీస్థాయిలో ఆర్థిక పెట్టుబడులు కూడా పెట్టారు. ఈ ఏడాది ప్రారంభంలో నిర్వహించిన ఈవెంట్‌కు అప్పటి ప్రభుత్వం వెచ్చించిన దాని కంటే అనేక రెట్ల పెరుగుదలతో హైదరాబాద్ ఆర్థిక వ్యవస్థకు 84 మిలియన్ డాలర్ల ప్రయోజనం చేకూరింది. పోటీల నిర్వహణకు గతంలో తెలంగాణ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నాం' అని ఫార్ములా-ఈ ప్రతినిధులు పేర్కొన్నారు.

### ఆ స్ఫూర్తి కనిపించకపోవడంతోనే రద్దు

**సతీష్‌రెడ్డి, తెలంగాణ రెడ్కో మాజీ చైర్మన్, బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్**

ఫార్ములా-ఈ రేస్ ప్రపంచ చాంపియన్‌షిప్ నిర్వహించడమంటే ఆషామాషీ విషయం కాదు. ఒక నగరాన్ని అందుకు వేదికగా మలచాలంటే సంబంధిత ప్రభుత్వం నిర్వాహకులకు నమ్మకం కల్పించాలి. కేసీఆర్ ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరిలో ఫార్ములా-ఈ రేస్‌ను విజయవంతంగా నిర్వహించింది. దాని వెనక బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కృషి ఎంతో ఉంది. కించిత్తు లోపం లేకుండా ఏర్పాట్లు కల్పిస్తామని వారిలో భరోసా కల్పించడంతో పాటు హైదరాబాద్ నగరానికి ఆ స్థాయి హంగులు ఉన్నాయనే విశ్వాసాన్ని ప్రోది చేశారు. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో ప్రతినిధులు ప్రభుత్వ పెద్దలతో సంప్రదించినపుడు పరిశీలించిన అంశాలు... ముఖ్యంగా ఫార్ములా-ఈ నిర్వహణతో తెలంగాణకు కలిగే ప్రయోజనం ఏమిటి? అంటూ కాంగ్రెస్ ప్రభుత్వం లేఖ రాయడం నిర్వాహకుల్లో ఆందోళన కలిగించింది.

# మూడు రోజుల్లోనే!

**తొలి టెస్టులో దక్షిణాఫ్రికా జయకేతనం**

**ఇన్నింగ్స్ 32 పరుగులతో భారత్ ఓటమి**

**కోహ్లీ పోరాటం వృథా**



కోహ్లీ (76)

**గత మూడు దశబ్దాలుగా ఊరిస్తున్న టెస్టు సిరీస్‌ను ఈసారైనా టీమిండియా చేజిక్కించుకుంటుందనుకుంటే.. అది అత్యాశే అయింది. సఫారీ గడ్డపై అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్‌లో ఏ మాత్రం ఆకట్టుకోలేకపోయిన రోహిత్ సేన బాక్సింగ్ డే టెస్టులో ఘోర పరాజయం మూటగట్టుకుంది. మూడు రోజుల్లోనే ముగిసిన పోరులో రాహుల్, బుమ్రా, కోహ్లీ తప్ప మిగిలిన వాళ్లు ఏమాత్రం ప్రభావం చూపలేకపోయారు. రెండు మ్యాచ్‌ల సిరీస్ కావడంతో ఈ సారి కూడా మనవాళ్లు రిక్తహస్తాలతోనే స్వదేశానికి తిరిగి రావడం ఖాయమైనట్లే!**

సెంచూరియన్: ప్రత్యర్థి బ్యాటర్లు గంటల కొద్ది క్రీజులో పాతుకుపోయి.. మంచినీళ్ల ప్రాయంలా పరుగులు రాబట్టిన చోట మన స్టార్లు కనీస పోరాటం కనబర్చలేకపోయారు. తొలి ఇన్నింగ్స్‌లో పిచ్ బౌలర్లకు సహకరించింది అని సర్దిచెప్పుకున్నా.. మంచి ఎండ కాసి బ్యాటింగ్‌కు అనుకూలంగా కనిపించిన సమయంలో రెండో ఇన్నింగ్స్‌లో మనవాళ్లు పూర్తిగా తేలిపోయారు. డగౌట్‌లో ఏదో ముఖ్యమైన పని ఉన్నట్లు ఒకరి వెంట ఒకరు పెవిలియన్‌కు వరుస కట్టారు. ఫలితంగా మూడు రోజుల్లో ముగిసిన బాక్సింగ్ డే టెస్టులో భారత్ ఇన్నింగ్స్ 32 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికా చేతిలో ఓడింది. దీంతో రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో దక్షిణాఫ్రికా 1-0తో ఆధిక్యం సాధించగా.. తదుపరి మ్యాచ్‌లో భారత్ నెగ్గినా.. సిరీస్ చేతికి చిక్కదు. ఓవర్‌నైట్ స్కోరు 256/5తో గురువారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన దక్షిణాఫ్రికా 408 పరుగులకు ఆలౌటైంది. డీన్ ఎల్గర్ (185; 28 ఫోర్లు) భారీ సెంచరీతో కదంతొక్కగా.. మార్కో జాన్సెన్ (84 నాటౌట్; 11 ఫోర్లు, ఒక సిక్సర్) అజేయ అర్ధశతకంతో రాణించాడు. భారత బౌలర్లలో బుమ్రా 4, సిరాజ్ రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్.. 131 పరుగులకు ఆలౌటైంది. మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ (76; 12 ఫోర్లు, ఒక సిక్సర్) ఒంటరి పోరాటం చేయగా.. అతడితో పాటు శుభ్‌మన్ గిల్ (26; 6 ఫోర్లు) మాత్రమే రెండంకెల స్కోరు చేశాడు. కెప్టెన్ రోహిత్ (0) డకౌట్ కాగా.. యశస్వి జైస్వాల్ (5), శ్రేయస్ అయ్యర్ (6), కేఎల్ రాహుల్ (4), అశ్విన్ (0), శార్దూల్ ఠాకూర్ (2) విఫలమయ్యారు. సఫారీ బౌలర్లలో బర్గర్ 4, జాన్సన్ మూడు వికెట్లు పడగొట్టారు. ఎల్గర్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య వచ్చే నెల 3 నుంచి కేప్‌టౌన్‌లో రెండో టెస్టు జరగనుంది.

**సంక్షిప్త స్కోర్లు**

భారత్ తొలి ఇన్నింగ్స్: 245; దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 408 (ఎల్గర్ 185, జాన్సెన్ 84 నాటౌట్; బుమ్రా 4/69, సిరాజ్ 2/91), భారత్ రెండో ఇన్నింగ్స్: 131 (కోహ్లీ 76; బర్గర్ 4/33, జాన్సెన్ 3/36).

### లాయర్స్ క్రికెట్ ప్రపంచకప్‌లో అన్వేష్‌రెడ్డి



కోరుట్ల రూరల్, డిసెంబర్ 28: జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం జోగిన్‌పల్లి గ్రామానికి చెందిన ఏనుగు అన్వేష్‌రెడ్డి లాయర్స్ క్రికెట్ ప్రపంచకప్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు ఈ నెల 28 నుంచి 6 వరకు కోలంబో (శ్రీలంక)లో జరిగే లాయర్స్ క్రికెట్ ప్రపంచ కప్‌లో ఆడనున్నారు. ఈ ప్రపంచకప్ టోర్నీలో భారత్, శ్రీలంక, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, పాకిస్థాన్, బంగ్లాదేశ్‌తో పాటు కామన్వెల్త్ జట్లు తలపడనున్నట్లు అన్వేష్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ హైకోర్టు అడ్వకేట్ క్రికెట్ టీం వైస్ కెప్టెన్‌గా అన్వేష్‌రెడ్డి వ్యవహరిస్తున్నారు.

## అమ్మాయిల పరాజయం



ముంబై: బ్యాటర్లు సత్తా చాటినా.. బౌలర్లు రాణించలేకపోవడంతో ఆస్ట్రేలియాతో తొలి వన్డేలో భారత మహిళల జట్టు పరాజయం పాలైంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా గురువారం జరిగిన పోరులో టీమ్‌ఇండియా 6 వికెట్ల తేడాతో ఆసీస్ చేతిలో ఓడింది. మొదట మన అమ్మాయిలు 50 ఓవర్లలో 8 వికెట్లకు 282 పరుగులు చేశారు. జెమీమా రోడ్రిగ్స్ (77 బంతుల్లో 82; 7 ఫోర్లు), పూజ వస్త్రాకర్ (46 బంతుల్లో 62 నాటౌట్; 7 ఫోర్లు, 2 సిక్సర్లు), యస్తిక భాటియా (49) అదరగొట్టారు. ఆసీస్ బౌలర్లలో ఆష్లే గార్డ్‌నర్, జార్జియా చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో ఆస్ట్రేలియా 46.3 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 285 పరుగులు చేసింది. లిచ్‌ఫీల్డ్ (78), ఎలీసా పెర్రీ (75), తహిలా మెక్‌గ్రాత్ (68 నాటౌట్) అర్ధశతకాలు సాధించారు. ఇరు జట్ల మధ్య శనివారం రెండో వన్డే జరగనుంది.

## మార్ష్ మెరుపులు

మెల్‌బోర్న్: పేస్ ఆల్‌రౌండర్ మిషెల్ మార్ష్ (96; 13 ఫోర్లు) దుమ్మురేపడంతో పాకిస్థాన్‌తో జరుగుతున్న రెండో టెస్టులో ఆస్ట్రేలియా మంచి స్కోరు దిశగా సాగుతున్నది. పాక్ పేసర్లు హమ్జ (3/27), షాహీన్ అఫ్రిది (3/58) ధాటికి ఒక దశలో 16 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయిన ఆసీస్‌ను మార్ష్, స్మిత్ (50) ఆదుకున్నారు. అంతకుముందు పాకిస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో 264 పరుగులకు ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో కలుపుకొని ఆసీస్ ఓవరాల్‌గా 241 రన్స్ ముందంజలో ఉంది.






Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.